## ప్రజా సంక్షేమానికి పని చేస్తాం



ప్రజా సంక్షేమానికి పనిచేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం ఆజంపురా డివిజన్‌లోని రసూల్ పురాలో స్థానికులను కలిసి గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అబ్రార్, అలీం పాల్గొన్నారు. **- చాదర్‌ఘాట్, అక్టోబర్ 17**

# ఒక్కేసి పువ్వేసి చందమామా



పూలను పూజించే సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం దవాఖాన ఆవరణలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. స్టాఫ్‌నర్సులు, సిబ్బందితో కలిసి ఇద్దరు అక్కాచెల్లెల్ల ఉయ్యాలా.. ఒక్క ఊరికి ఇచ్చి ఉయ్యాలా. ఒక్కడే మాయన్న ఉయ్యాలా.. వచ్చి అన్నా పోడు ఉయ్యాలా.. ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్క జాములాయే చందమామ అంటూ ఆడి పాడారు. **- సుల్తాన్‌బజార్, అక్టోబర్ 17**

## ఇంపాక్ట్ ట్రైనర్‌గా దేశపాక శంకర్



ఇంపాక్ట్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ పొందుతున్న దేశపాక శంకర్

హయత్‌నగర్, అక్టోబర్ 16: హయత్‌నగర్‌కు చెందిన దేశపాక శంకర్ ఇంపాక్ట్ ట్రైనర్‌గా ఎన్నికైనట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్స్ వర్క్‌షాప్ 130వ బ్యాచ్‌కు చెందిన శంకర్‌కు కామారెడ్డిలో ఒక ప్రైవేట్ హోటల్‌లో రెండు రోజుల పాటు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ పొందడం వల్ల జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పడం ద్వారా వారిని సమాజానికి ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని తెలిపారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు, కోఆర్డినేటర్లు నక్క నవీన్, మహేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గాయత్రి దేవిగా అమ్మవారు



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సైదాబాద్ డివిజన్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో గాయత్రి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

**-సైదాబాద్, అక్టోబర్ 17**



జువైనల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీస్ స్పెషల్ సెక్రటరీ శృతి ఓజాను మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బేగ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన స్పెషల్ సెక్రటరీని ఆమె కార్యాలయంలో కలిసి పూలమొక్కను అందజేశారు. **- సైదాబాద్, అక్టోబర్ 17**

## ట్రాన్స్‌జెండర్స్ నమోదు శిబిరం

ఆర్కేపురం, అక్టోబర్ 17 : సరూర్‌నగర్‌లోని మహిళా సాధికారత కేంద్ర కార్యాలయంలో మంగళవారం స్త్రీ, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల, లింగమార్పిడి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓటరు గుర్తింపు కార్డు, ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ నమోదు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బి.పద్మజా రమణ మాట్లాడుతూ ఈ శిబిరంలో 150 మందికి పైగా లింగమార్పిడి వ్యక్తులు పాల్గొన్నారని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం నుంచి ట్రాన్స్‌జెండర్లకు ఓటరు ఐడీ నమోదుకు వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముకుందమాల, వినీతాదేవి, విజయభాస్కర్, మంజుల, శ్రీకాంత్, కిరణ్, ఆర్తి, కవిత, కేజీయా, స్రవంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన అవసరం

చాదర్‌ఘాట్, అక్టోబర్ 17: శస్త్ర చికిత్సల నేపథ్యంలో శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన అవసరమని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ శివానంద రెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేట కేర్ హాస్పిటల్స్‌లో మైక్రో వాస్కులర్ సర్జరీ స్కిల్స్ ట్రైనింగ్ పై ఒక రోజ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరోసైన్సెస్ సర్జికల్ అనాటమీ, విధానాలపై పరిజ్ఞానాన్ని మెరుగుపరచడానికి అనాటమీ టీచింగ్ సెషన్‌ను రోజంతా నిర్వహించారు. నేషనల్ ఫ్యాకల్టీ, ఎంజీహెచ్ హెల్త్‌కేర్ చెన్నై, న్యూరోసైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రూపేశ్ కుమార్, ఒమెగా హాస్పిటల్‌లోని న్యూరోసర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నరసింహారావు ఉన్నారు. దేశంలోని 25 మంది వైద్య ప్రతినిధులు హాజరు కావడంతో ప్రత్యేకత చేకూరిందని కె.వి.శివానంద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ అరుణ్ తెలిపారు. డాక్టర్ కే.వీ.శివనంద్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్జికల్ అనాటమీ, ముఖ్యంగా మైక్రో సర్జరీ రంగంలో అనుభవం ఉన్నప్పటికీ సవాలుగా కనిపిస్తుందన్నారు. మైక్రో సర్జికల్ ఆపరేషన్ ,న్యూరో వాస్కులర్ విషయంలో ఇంకా పరిణితి సాధించాలన్నారు.



మైక్రో సర్జికల్ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



వర్క్‌షాపునకు విచ్చేసిన వైద్య ప్రముఖులు

# స్థానికేతరులకు ఇస్తే పని చేయం



ఆజంపురా సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్, అక్టోబర్ 17:మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ స్థానికేతరులకు కేటాయించడంపై స్థానిక నేతలు భగ్గుమన్నారు. పార్టీ టికెట్ ఆశించిన నేతలు తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కాకుండా పార్టీ కోసం పని చేయని కొత్త వ్యక్తులకు టికెట్ కేటాయిస్తే ఎలా పని చేసేదంటూ మండిపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆజంపురా డివిజన్‌లో పార్టీ నేతలు షేక్ అర్షద్, అశ్వాక్ ఖాన్, కిషన్ సింగ్, గంట్ల కృష్ణ నేతృత్వంలో అత్యవసర భేటీ అయ్యారు. ఇదే విషయమై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి టికెట్ సమస్య గరించి వివరిస్తామన్నారు. పార్టీ అధిష్ఠానం తమకు న్యాయం చేస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మావేశంలో సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడు చక్రం, పాతమలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షకీల్, ఆజంపురా డివిజన్ అధ్యక్షులు రాహుల్, ఛావునీ డివిజన్ అధ్యక్షుడు షాహీద్ ఖాన్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17: విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాయన్నగూడ గ్రామానికి చెందిన కుమ్మరి గండయ్య(60) మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద బోరుమోటర్ పెడుతానని చెప్పి మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా గండయ్య మృతి చెంది ఉన్నాడు. స్టాటర్ వద్ద షాక్ తగలడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శబరిమలకు అయ్యప్ప స్వాములు

బండ్లగూడ,అక్టోబర్ 17: గండిపేట మండలం నుంచి 130 మంది అయ్యప్ప స్వాములు మాలధరణ ధరించి కేరళలోని అయ్యప్ప స్వామి దర్శనానికి పెద్ద ఎత్తున కాలి నడకన బయలు దేరి వెళ్లారు. వీరికి కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ పాలమాలకులో మంగళవారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.అనంతరం వారికి అవసరమైన మందల కిట్‌లను పంపిణీ చేశారు. వారు క్షేమంగా వెళ్లి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని రావాలని కోరారు.

## విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా

బండ్లగూడ,అక్టోబర్ 17: పెద్దమంగళారం ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఏఈ శ్రీనివాస్ తెలిపారు. హీరా కాలనీ, సన్‌సిటీ రహదారి, సీవైఆర్ గార్డెన్, భాగ్యనగర్ కాలనీ, కపిల్‌నగర్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 వరకు సన్‌సిటీ, పీఅండ్‌టీ కాలనీ, ఏబీసీడీ బ్లాక్స్, స్పెషల్ బ్లాక్, మఫెల్‌టౌన్, కీర్తిరిచ్‌మౌండ్ విల్లాస్, హైదర్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

## సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న కుర్రు రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ

మన్సూరాబాద్, అక్టోబర్ 17: నగరంలోని నిజాంపేటలో ఎరుకల కులస్తుల భవనం కోసం ఎకరం భూమిని ఇవ్వడమే కాకుండా భవన నిర్మాణానికి రూ.3.50కోట్లు వెచ్చించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తెలంగాణ ఎరుకల సంఘం(కుర్రు) రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ తెలిపారు. ఎల్బీనగర్ కామినేని చౌరస్తా సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు ఎరుకల కులస్తులను పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని ఎరుకల కులస్తులకు రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగపరంగా సముచితస్థానం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపూర వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాయపురం మహేందర్, ఎల్బీనగర్ ఇన్‌చార్జి ఉండ్రాతి రవి, ఉండ్రాతి వెంకన్న, మాదగాని నరేశ్ తదితరులు పాల్గొన్నారు.